


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
గురువారం | 06 ఆగస్టు, 2026 | పేజీలు :08



# వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, ప్రసూతి విభాగం, ల్యాబ్, ఫార్మసీ, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి వైద్యాధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ (అవుట్ పేషెంట్లు) సంఖ్య పెరిగేలా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను ప్రత్యేకంగా గుర్తించి నిరంతర పర్యవేక్షణలో ఉంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి సంతృప్తి చెందేలా సేవలు అందించాలని, రోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, రిఫరల్స్‌ను తగ్గిస్తూ సాధ్యమైనంత మేరకు స్థానికంగానే నాణ్యమైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచే విధంగా ప్రతి ఉద్యోగి సేవా భావంతో పనిచేయాలని ఆదేశించారు.




# స్కూళ్లు ప్రారంభమై మూడు నెలలైనా విద్యార్థులకు దుప్పట్లేవి ?

## హాస్టల్ విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

## ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నప్పటికీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వలేదని, అనేక హాస్టళ్లలో వానకు నీళ్ళు ఉరుస్తున్నాయనీ, కిటికీలు లేక చల్ల గాలులకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, హాస్టళ్ల విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తే ఉద్యమం తప్పదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న సంక్షేమ, గురుకుల హాస్టళ్లలో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సంక్షేమ శాఖల మంత్రులు కేవలం ఏసీ గదుల్లో సమావేశాలకు పరిమితమైతున్నారు తప్ప హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తి విఫలం చెందారని రమేష్ ఆరోపించారు. సంక్షేమ, గురుకుల హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు దుప్పట్లు కార్పెట్లు, పరుపులు, అందించాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ అధ్వర్యంలో బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ముందు నిరసన నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ మాట్లాడుతూ హాస్టళ్లలో కనీస వసతులు కూడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని అనేక సంక్షేమ, గురుకుల హాస్టళ్లు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లకు శాశ్వత పరిష్కారంగా సొంత భవనాలు నిర్మించి, అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నూనావత్ శ్రీనివాస్ నాయక్, జిల్లా నాయకులు కసిరెడ్డి సందీప్ రెడ్డి, వరుణ్ శివాజీ,నాయకులు బోయినీ విష్ణు, మహేష్ , కేశవ, అనోష్,ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

## సమర్థవంతమైన ప్రజాపాలన దిశగా చర్యలు




# ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యం వద్దు



## అదనపు కలెక్టర్ బి.ఎస్.లత

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) బి.ఎస్.లత అధికారులను ఆదేశించారు.ఈ మేరకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసిన దరఖాస్తు ఫారాలను ప్రజలు పూర్తిగా నింపి ఆగస్టు 10లోపు సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని కోరారు. ఫారాలు నింపడంలో ఎలాంటి సందేహాలు ఉన్నా తరువాయి 2లో

## నాంపల్లి వద్ద కూలిన భారీ మర్రి వృక్షం

**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి నుండి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారిపై బుధవారం ఒక భారీ మర్రి వృక్షం కూలిపడింది. దీనితో కరీంనగర్ – సిరిసిల్ల – వేములవాడ మధ్య తీవ్రస్థాయిలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. రహదారికి ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఈ మార్గం నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే కీలకమైన ప్రధాన రహదారి కావడంతో, చెట్టు కూలడంతో దాదాపు మూడు గంటల పాటు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చెట్టు తొలగింపు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి రాకపోకలను పునరుద్ధరించడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు.

## సవరణలో నిర్లక్ష్యం వద్దు

(మొదటిపేజీ తరువాయి)

బీఎల్‌ఓలు లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో ఫారాల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బీఎల్‌ఓలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించి ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నివసించని వారు, ఇతర ప్రాంతాలకు మారిన వారు లేదా వేరే ప్రాంతంలో ఓటు నమోదు చేసుకున్న వారు సంబంధిత వివరాలను ఫారంలో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ప్రతి అర్హత ఓటరు గడువు లోపు ఫారాలను సమర్పించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని అదనపు కలెక్టర్ బి.ఎస్.లత విజ్ఞప్తి చేశారు. సమీక్ష సమావేశంలో మెట్‌పల్లి తహసీల్దార్ నీత, బీఎల్‌ఓలు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రంగును పాకిస్తాన్‌తో పోల్చడం సరికాదు

**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** బిజెపి నాయకులు అభివృద్ధి అంశాలు పక్కన పెట్టి మత విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ భవనానికి వేసిన రంగుల వివాదంలో బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. జాతీయ జెండాలోని రంగులను పాకిస్తాన్‌తో పోల్చడం దేశభక్తి కాదని బీజేపీ నాయకుల కండువాలో కూడా ఆకుపచ్చ త్రివర్ణ పతాకాన్ని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులపై, సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీపై కార్యకర్తలపై అనుచిత వాక్యాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ తాళ్ళ విజయ్ రెడ్డి, ఆరుట్ల మహేష్ రెడ్డి, రంజాన్ నరేష్, సారగు రాకేష్, గోవర్ధన్, కరుణాకర్,బండి శ్రీకాంత్, చాకలి బాబు, ఏద్దెండి మహేష్, భాను, సారుగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల బాధ్యత కీలకం

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** గ్రామాలలో మంచినీటి సమస్యల పరిష్కారానికి శాశ్వత కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండల సర్వసభ్య సమావేశం సమావేశ మందిరంలో ఎంపీడీవో దివ్య దర్శన్ రావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలు హాజరయ్యారు. సమావేశంలో సర్పంచులు గ్రామాల సమస్యలను ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా గ్రామాలలో తాగునీటి సమస్యలను సర్పంచులు ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల త్రాగునీటికీ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత డిఈ, ఏఈలకు విప్పు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలో 50 కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులైన వాష్రూమ్స్, ప్రహరీల నిర్మాణం, పాస్ ఏరియాల, మంచి నీటి సౌకర్యాల కల్పనకు కృషి చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతిలో సుల్తానాబాద్ మండల టాపర్‌గా స్థానిక జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన సిరివల్లి క 585 మార్కులతో జిల్లా టాపర్గా నిలిచారని ఇంటర్మీడియట్‌లో వి.సౌమ్య 1000 మార్కులకు 994 మార్కులు సాధించి రాష్ట్ర టాపర్‌గా నిలవడం గర్వకారణమని తెలిపారు. గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలో వసతుల కల్పనపై లిఖితపూర్వకంగా ఎంఈఓ ఎంపీడీవోలకు సర్పంచ్‌లు దరఖాస్తులు వ్రాసి అందించాలని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సమావేశం వివిధ అంశాలపై కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, తహసిల్దార్ బషీరుద్దీన్, ఎంపీడీఓ దివ్య ధర్శన్ రావు, మండలంలోని సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్‌లు, చిలుక సతీష్, కల్లేపల్లి జానీ, మురళిధర్ రావు, భాస్కర్ రెడ్డి, నమని రాజిరెడ్డి, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పలువురు పాల్గొన్నారు.

## వ్యసన రహిత సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలి

### అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/కరీంనగర్ :** ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, మౌంట్ అబూ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన రూ.10 కోట్ల వ్యసన ముక్త మెగా క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం సాయంత్రం కరీంనగర్ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వ్యసనాల బారిన పడకుండా యువతతో పాటు సమాజంలోని అన్ని వర్గాల్లో అవగాహన కల్పించడం, దేశవ్యాప్తంగా 10 కోట్ల మందితో వ్యసన విముక్తి ప్రతిజ్ఞ చేయించడమే ఈ మహా అభియాన్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, మత్తు పదార్థాలు వ్యక్తి ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబాలను, సమాజాన్ని కూడా దెబ్బతీస్తాయని అన్నారు. వ్యసన రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువత మంచి అలవాట్లను పెంపొందించుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ స్వామి, డీడబ్ల్యూఓ సరస్వతి, ఆర్డీవోలు షర్మిల, జల కుమారి, తహసీల్దార్లు (ఎంఆర్వోలు), వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొని వ్యసన రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు.బ్రహ్మకుమారీలు మనీషా, విజయలక్ష్మి , బి కే లత, బి కే సారిక తదితరులు పాల్గొన్నారు.

## ల్యాగలమర్రిలో భూ రీ సర్వే

**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండల పరిధిలోని ల్యాగలమర్రి గ్రామంలో భూ భారతి భూ సర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం భూ రీసర్వే పనులను ఘనంగా ప్రారంభించారు. తహశీల్దార్ సిరిపురం గిరి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ దేవ్‌రావు సంయుక్తంగా ఈ సర్వే ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ల్యాగలమర్రి గ్రామ సర్పంచ్ ఎల్కటూరి రవి, ఎల్లాపూర్ గ్రామ సర్పంచ్ పులి రాజేశం, గిర్దావర్ శ్రీనివాస్, సర్వేయర్ తనుజరాణి, జీపీఓలు,రెవెన్యూ అధికారులు, గ్రామ రైతుల సమక్షంలో సర్వే పనులను అధికారికంగా మొదలుపెట్టారు. భూ వివాదాల పరిష్కారానికి, భూ రికార్డుల ఆధునీకరణకు ఈ రీసర్వే ఎంతో దోహదపడుతుందని అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజా ప్రతినిధులు,రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామసభ

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలం వేంపేట్ గ్రామంలో బుధవారం జీపీడీపీ (గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక) గ్రామసభను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీవో మహేందర్ రెడ్డి,మెట్‌పల్లి ఎస్సై పబ్బా కిరణ్ కుమార్,వ్యవసాయ శాఖ ఏఈఓ మమత,విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ వైద్యులు డా. నాగార్జున ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.గ్రామ మహిళలు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మండల ఎంపీడీవో మహేందర్ రెడ్డి. మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. జలసిరి కార్యక్రమం,గ్రామ పరిశుభ్రత, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి నిర్వహించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లూరి సురేందర్ రెడ్డి, వార్డు సభ్యులు చంద్రచారి,దశకంఠ రాజు,జిల్లా శ్రీనివాస్ యాదవ్,నల్ల రాజశేఖర్ రెడ్డి, గోరుమంతుల రఘు,మగిడి శైలజ,బిక్కిసోని బిరుకుల మౌనిక,తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రిపాలు పట్టడం ఎంతో శ్రేష్టమని తద్వారా శిశువులు రోగ నిరోధక శక్తి పెంపొందిస్తుందని మల్లాపూర్ సర్పంచ్ చిట్యాల లక్ష్మ ణ్, వేంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్లవత్ రాజేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఇరు గ్రామాలలో చేపట్టిన తల్లిపాల వారోత్సవాల్లో సర్పంచులు పాల్గొని మాట్లాడారు.తల్లిపాలలో బిడ్డ ఎదుగుదలకు కావాల్సిన పోషకాలు ఉంటాయని జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందని ఎలాంటి వ్యాధులు దరి చేరవని సూచించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శంకరమ్మ, వైద్యాధికారిని వాహిని,వార్డు సభ్యులు ముష్కరి రమేష్, సామాజిక కార్యకర్త ఏనుగు వెంకటరెడ్డి అంగన్వాడీ టీచర్లు,ఆశ కార్యకర్తలు,గర్భిణీలు బాలింతలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/పెగడపల్లి :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇమ్యునైజేషన్ అధికారి డా. నరేందర్ బుధవారం మండలంలోని ఆరవెల్లి గ్రామంలో నిర్వహించిన తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన తల్లి పాల ప్రాముఖ్యత, శిశువుల ఆరోగ్యానికి అది అందించే రోగనిరోధక శక్తి గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ప్రతి చిన్నారికి వయస్సుకు అనుగుణంగా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. అనంతరం ఆయన పెగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి టీకాల నిల్వలు, ఫార్మసీ, ఓపీ సేవలు, గర్భిణుల నమోదు, మాతాశిశు ఆరోగ్య కార్యక్రమాల అమలు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డా. నరేష్,సీహెచ్‌వో సందీప్,పీహెచ్ఎన్ సావిత్రి, సూపర్వైజర్లు శ్రీనివాస్, జయశీల, జ్యోతి, శ్రీకాంత్ రెడ్డి ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు,ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాం తనిఖీ

**ప్రజాపక్షం/కరీంనగర్ :** జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను బుధవారం అదనపు కలెక్టర్ (రెవిన్యూ) డి.శ్రీనివాస్ రెడ్డి రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవియం గదుల వివి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మార్వో రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బిజెపి పార్టీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు మిడిదొడ్డి కపిల్, మహమ్మద్ పహాద్ ఎంఐఎం పార్టీ ప్రతినిది మజిత్ హుస్సేన్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## గంగమ్మకు పూలాభిషేకం

**ప్రజాపక్షం/కొత్తపల్లి :** మండలంలోని నాగులమల్యాల గ్రామ శివారు కొత్త చెరువు నిండి అలుగు పారుతున్న సందర్భంగా కొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ డిసిసి అధ్యక్షులు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ హాజరై నాయకులతో కలిసి గంగమ్మ తల్లికి పూలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టుల నుంచి వరద కాలువ ద్వారా వస్తున్న నీరు ఆనాటి కాంగ్రెస్ నాయకులు పివి.నరసింహారావు ఆలోచన విధానం ఫలితం అని, వైస్ రాజశేఖర్ రెడ్డి కృషితో ఎల్లంపల్లి ప్రాజెక్టులు నిర్మించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు స్వామి గౌడ్, సీనియర్ నాయకులు మడుపు మోహన్, కామారెడ్డి రాంరెడ్డి, తిరుపతి, అమరిశెట్టి కనకయ్య, గుర్తూరి మురళి, మల్యాల రాజా గౌడ్, సుంకె రాజగోపాల్, నాంపల్లి లష్మయ్య, బండపల్లి చందు, పెంట శేఖర్, వెన్నం శ్రీనివాస్, కుమ్మరి నాగయ్య, దేవదాస్, శంకర్, నరేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మా గోడు పట్టించుకోరా?

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** వికసిత్ భారత్‌గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్(గ్రామీణ్) చట్టం ప్రకారం బుధవారం రాష్ట్ర (ఉపాధి హామీ) జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఎల్లారెడ్డిపేట మండల సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో కార్యాలయ ఆవరణలో నిరసన తెలియజేశారు. 6వ రోజున షెడ్డౌన్ చేయడం జరిగింది. గత 20 సంవత్సరముల నుండి పని చేస్తూ పల్లె ప్రగతిలో భాగస్వాములమై గ్రామీణ పేద కుటుంబాలకు ఆర్థిక స్వావలంబన అందించాలని ప్రభుత్వం కల్పించిన పథకంలో మా వంతు పాత్రను నిర్వహించమన్నారు. 2024 ఫిబ్రవరి నెలలో ఇంద్రవెల్లి సభలో ఇచ్చిన హామీ ప్రకారం మాకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ పేస్కేల్ ఇప్పించాలని సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొందరగా బదిలీలు చేపట్టాలని ప్రభుత్వ ఉద్యోగులతో సమాన పని చేస్తూ ప్రభుత్వం నిర్దేశించిన పనులు సకాలములో పూర్తి చేశాము. కావున రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో కొమురయ్య, వై.రాజు, నాగరాజు, ప్రభాకర్, ప్రవీణ్, గీత, అశోక్ పాల్గొన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న వీర్నపల్లి పెద్దవాగు

**ప్రజాపక్షం/వీర్నపల్లి :** మండల కేంద్రంలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి ఉమ్మడి మద్దిమల్ల రాయిని చెరువు పూర్తిగా నిండి అలుగు దూకడంతో వీర్నపల్లి పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మద్దిమల్ల గ్రామం, కాశీతండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికులు ఎవరూ వాగు దాటే సాహసం చేయవద్దని పోలీసులు హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులు విజ్ఞప్తి చేశారు.



## ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ఇటీవలే మృతి చెందిన ప్రమాదవశాత్తు గాయపడిన ఇరువురిని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన యానం పెద్ద మల్లయ్య పాము కాటు గురై మరణించగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అలాగే రెవిన్యూ శాఖలో పనిచేస్తున్న యేసు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతుండగా పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, సీనియర్ నాయకులు డీలర్ మల్లయ్య, రామ్ రెడ్డి, రాజారెడ్డి, బైరి రవి కుమార్ యాదవ్, లింగస్వామి గౌడ్, బిఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ధర్మపురి విద్యార్థి ఎంపిక

**ప్రజాపక్షం/ధర్మపురి:** ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ జెడ్పి ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ముస్కు విశాల్ జగిత్యాల జిల్లా స్థాయి జావెలెన్ త్రో పోటీలలో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఐదవ జాతీయ జావెలిన్ సంబరాలు, మొదటి రాష్ట్ర ఛాంపియన్ షిప్ అండర్ 16 విభాగంలో పాల్గొని ప్రథమస్థానంలో నిలిచాడు. ఈనెల 7న హన్మకొండ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొలిచాల శ్రీనివాస్, ఫిజికల్ డైరెక్టర్ అటుకుల స్వప్న, ఉపాధ్యాయులు విశాల్‌ను అభినందించారు.

## పలువురు ఎస్సైల బదిలీలు

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** జగిత్యాల జిల్లా పోలీసు శాఖలో ఎస్ఐల బదిలీలు, పోస్టింగ్‌లు చేపట్టారు. డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఎన్. సదాకర్‌ను ధర్మపురి పోలీస్ స్టేషన్ ఎస్ఐ1 గా నియమించగా,ప్రస్తుతం ధర్మపురి ఎస్సైగా ఉన్న మహేష్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు.జి. శ్యాంరాజ్‌ను కోరుట్ల పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నియమిస్తూ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

## రైతులు సర్వే అధికారులకు సహకరించాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతిలో భాగంగా భూ రీ సర్వేను రత్నాపూర్ గ్రామంలో అధికారులు చేపట్టగా సర్పంచ్ గొంద రాజేందర్ బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని రైతులు ఏలాంటి అపోహలు చెందకుండా అధికారులు చేపట్టే రీసర్వేపు సహకరించాలని సర్పంచ్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిపిఓ, సర్వే సిబ్బంది, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

# స్థానిక పేదలకే ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండల కేంద్రంలోని ధర్మసాగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిని స్థానిక నిరుపేదలకే ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని కోరుతూ టీజేఎస్ మండల అధ్యక్షుడు కంతి రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బైండ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ బీఎస్ఎస్ వరప్రసాద్ ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూఇటీవల ఆర్డీవో స్థానికేతరులైన బయటి ప్రాంతం వారి కి ఇళ్ల స్థలాల కోసం డబుల్ బెడ్ రూమ్ కాలని లో ప్రభుత్వ భూమిని పరిశీలించిన నేపథ్యంలో,ముందుగా ఎన్నో ఏళ్లుగా గ్రామంలో నివసిస్తూ ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న స్థానిక పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలని వారు కోరారు.



స్థానికుల హక్కులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.వినతి పత్రం ఇచ్చిన వారిలో అజారుద్దీన్, తలారి నవీన్, పరశురాం, దినేష్, కసుక జగన్, హరీష్, సాగర్, తిరుపతి, ప్రవీణ్, రిజ్వాన్, మారుతి, నిఖిల్, ఉదయ్, తదితరులున్నారు.

# జగిత్యాలలో బోనాల సందడి



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను చిన్నారుల కేరింతలు, జానపద కళల సందడి, భక్తి పారవశ్యంతో స్థానిక శ్రీ కృష్ణవేణి పాఠశాలలో మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన విద్యార్థులు, అందంగా అలంకరించిన బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని రంగవల్లులు, పూలతో సుందరంగా అలంకరించారు.బోనాల పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు బోనాల పండుగకు సంబంధించిన జానపద గీతాలు, నృత్యాలు,సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం,తదితరులు ఉన్నారు.

# శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే అమృతం





**ప్రజాపక్షం/ధర్మపురి :** పుట్టిన ప్రతీ శిశువుకు మొదటి గంటలోపే తల్లిపాలు అందివ్వడం ద్వారా పిల్లలకి అమృతాన్ని అందించినవారవుతారని నాగారం గ్రామ సర్పంచ్ చిలుముల లక్ష్మణ్,ధర్మపురి మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ సంగి ఆనంద్ అన్నారు.ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని 10 వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సంగి ఆనంద్ పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే మండలంలోని నాగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అతిథిగా సర్పంచ్ లక్ష్మణ్ పాల్గొన్నారు.శ్వాసకోశ సంబంధిత వ్యాధులతోపాటు అనేక ఆరోగ్య సమస్యల నుంచి రక్షణ కల్పిస్తాయని లక్ష్మణ్, ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో డా.వినయ్, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్, బాలింతలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు,బాలింతలకు పౌష్టికాహారం, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.ఏఎన్ఎమ్ లావణ్య మాట్లాడుతూ, పుట్టిన శిశువుకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలే ఉత్తమ ఆహారమని తెలిపారు. తల్లిపాల వల్ల శిశువుకు సంపూర్ణ పోషకాలు అందడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, తల్లుల ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుల్ల జగన్ గౌడ్,పంచాయతీ కార్యదర్శి గుంటుక మమత, అంగన్‌వాడీ కార్యకర్తలు శారద,పద్మ, పూలమ్మ, ఆశా వర్కర్లు,గర్భిణులు,బాలింతలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ బన్న సుమలత మాట్లాడుతూ, పుట్టిన వెంటనే వచ్చే మురుపాలు శిశువుకు ఎంతో మేలు చేస్తాయని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం అదనపు ఆహారం, పౌష్టికాహారం అందించే విధానంపై గర్భిణులు, బాలింతలకు వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొప్పెల్ల పద్మ వెంకట్, హెచ్ఎం సుధారాణి, ఉపాధ్యాయులు వేణుగోపాల్,విశాల్, రాణి, నర్మద, జోష్న, వీవో అధ్యక్షురాలులక్ష్మి , గర్భిణులు, బాలింతలు, పాల్గొన్నారు.

# విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** కరీంనగర్ రూరల్ మండలంలోని ఇరుకుల్ల గ్రామంలోని మైనార్టీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కరీంనగర్ రూరల్ పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ క్రైమ్, సైబర్ సెక్యూరిటీ, డ్రగ్స్, గంజా తదితర మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై విపులంగా అవగాహన కల్పించారు. సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితో పంచుకోవద్దని, తెలియని లింకులు, సందేశాలను నమ్మవద్దని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ సీఐ ఎ.నిరంజన్ రెడ్డి, కరీంనగర్ రూరల్ పోలీసులు, సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోనాల వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి:** బోనాల పండుగ సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాలక్ష్మమ్మ అమ్మవారి ఆశీస్సులతో మెట్‌పల్లి పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, కౌన్సిలర్లు పందిరి రమేష్, నునుగొండ నరేష్, గుడికందుల అజయ్, మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు, మున్సిపల్ అధికారులు,సిబ్బంది, నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

## ఆషాఢ మాసపు మైదాకు సంబరాలు

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసపు మైదాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థినులు కళాశాల ఆవరణలోని మైదాకు మొక్కల నుంచి ఆకులను సేకరించి,వాటిని చక్కగా నూరి సంప్రదాయబద్ధంగా చేతులకు అలంకరించుకున్నారు. అనంతరం హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ నీరజ మాట్లాడుతూ మైదాకు ఔషధ గుణాలు,ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు.ముఖ్యంగా వర్షాకాలంలో మైదాకు వినియోగించడం వల్ల వివిధ రకాల చర్మవ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రమోద్ కుమార్,వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు సంగీతారాణి, శ్రీలత,సుజాత,హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ నీరజ, అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది,కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** నిరుపేదలకు అండగా నిలువడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య పేర్కొన్నారు. జగిత్యాల అర్బన్, రూరల్ మండలాలకు చెందిన 100మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.41.35 లక్షల విలువగల చెక్కులను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు లబ్ధిదారులకు జగిత్యాల మోతే రోడ్డు పార్టీ కార్యాలయంలో నందయ్య పంపిణీ చేసి మాట్లాడారు.ఎమ్మెల్యే చొరవతో అత్యధిక సీఎం సహాయ నిధి చెక్కులు జగిత్యాలకు మంజూరు అయ్యాయన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం,తదితరులు ఉన్నారు.

## సొసైటీ అధ్యక్షుడిగా ముద్దసాని శ్రీనివాస రెడ్డి

**ప్రజాపక్షం/మానకొండూర్:** ఊటూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకరోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. సంఘం అధ్యక్షునిగా ముద్దసాని శ్రీనివాస రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ సంఘం అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తానని అన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు చైర్మన్ ముద్దసాని శ్రీనివాస రెడ్డిని డైరెక్టర్లు ఎడ్ల శ్రీధర్, కనవేని మధునయ్య, కొమ్మగాళ్ల స్వరూప, మండల బక్కరెడ్డి, గోపు శ్రీనివాస్ రెడ్డి, బొగాని కనకయ్య, కంకణాల భూమిరెడ్డి, ప్రేమలత, రాజేశ్వరి, స్వామి, రంగయ్య, మల్లేశంను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్రాచారి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సంపత్ గౌడ్, సర్పంచులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# శంఖారావం పూరించిన రచ్చపల్లి అయ్యప్ప స్వాములు

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామ నూతన బ్రాంచ్ కమిటీ సమావేశం మంగళవారం రాత్రి రచ్చపల్లిలోని శివాలయంలో మూల బాలయ్య గురుస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏబిపిపి తెలంగాణ రాష్ట్ర వాలంటీర్ కమాండంట్ జనగామ తిరుపతి పాల్గొన్నారు ముందుగా శ్రీ అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసారు. ఎంతో భక్తి శ్రద్దలతో స్వామి వారి శరణు ఘోష పలికి అయ్యప్ప ధర్మ ప్రచారం కోసం ముకుమ్మడిగా శంఖారావం పూరించారు. అనంతరం అఖిల భారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ రచ్చపల్లి బ్రాంచ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మూల బాలయ్య ,ఉపాధ్యక్షులుగా నాగమల్ల భూపతి, కార్యదర్శిగా మోర గణపతి, సంయుక్త కార్యదర్శిగా సూత్రాల వెంకటేష్ ,



కోశాధికారిగా మోర సాయి కుమార్, వాలంటీర్ కెప్టెన్ గా దొనికె ని తిరుపతి గౌడ్, సెంట్రల్ ఎలక్టోరల్ సభ్యులుగా బుర్ర మనివర్ధన్, కార్యవర్గ సభ్యులుగా గుండు చందు,చింతల సూర్య ప్రకాష్, కట్ల అరుణ్,గుండ అనిల్ కుమార్,కత్తెర్ల శ్రావణ్, మామిడి అరుణ్ రెడ్డి, వేల్పుల సంపత్ మరియు తమ్మనవేని శేఖర్ గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**– సమావేశంలో పలు ముఖ్య తీర్మానాలు :** ధర్మారం మండలంలో అయ్యప్ప దీక్షా నియమాలు, ధర్మ ప్రచారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. పేద అయ్యప్ప భక్తులను సన్నిధానం తీసుకువెళ్లడం, అన్న దాన కార్యక్రమాలు చేయడం లాంటి తీర్మానాలు చేసారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఈ సి మెంబెర్ కెక్కర్ల లింగయ్య, జిల్లా మాజీ ఈ సి మెంబర్ ముత్యాల సతీష్, ఏబిపిపి ఎన్టిపిసి అన్నపూర్ణ కాలనీ బ్రాంచ్ అధ్యక్షులు వేదాంతం శేషు కుమార్ గురు స్వామి, గోదావరి ఖని బ్రాంచ్ కార్యదర్శి ఆర్ఎస్ మూర్తి, పెద్దపల్లి బ్రాంచ్ అధ్యక్షులు జక్కుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు భూతగడ్డ అజయ్, సంయుక్త కార్యదర్శి భూతగడ్డ సంపత్, కోశాధికారి చుంచు యాదగిరి మరియు గుర్రం రమేష్ తో పాటు స్థానిక స్వాములు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చివరగా నూతన బ్రాంచ్ కమిటీ సభ్యుల చేత శ్రీఅయ్యప్ప స్వామి సాక్షిగా జనగామ తిరుపతి ప్రమాణ స్వీకారం చేపించి బాధ్యతలు అప్పగించారు.

## ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా 4వ మహాసభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్/పెద్దపల్లి :** ఏఐటీయూసీ పెద్దపెల్లి జిల్లా నాలుగవ మహాసభలను సుల్తానాబాద్ కేంద్రంలో ఈ నెల 20వ తేదీన. యశోద నరహరి ఫంక్షన్ హాల్లో జరుగుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వైవి రావు ,జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి సునీల్ తెలిపారు.ఈ మహాసభకు సిపిఐ జాతీయ నాయకులు ఉమ్మడి రాష్ట్రాల శాసనసభ ఫ్లోర్ లీడర్ కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్,ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్ బాలరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం హాజరు అవుతున్నారు.ఈ మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించుకోవడానికి మహాసభలో కార్మిక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన ఉద్యమ రూప కల్పన జరుగుతుందని అన్నారు. ఈ మహాసభకు ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు మధ్యాహ్న భోజనం, ఆశ, అంగన్వాడి, ఆర్టీ సీ సివిల్ సప్లై సంఘటిత అసంఘటిత కార్మిక వర్గం హాజరుకావాలని పిలుపునిచ్చారు.20వ తేదీన 10 గంటలకు సుల్తానాబాద్ ఐబి నుండి మహాసభ ప్రాంగణం వరకు ర్యాలీ జరుగుతుందని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## సూపరింటెండెంట్‌గా యం.సురేష్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నూతన సూపరింటెండెంట్‌గా యం.సురేష్ బాధ్యతలు స్వీకరించారు.ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఇక్కడ విధులు నిర్వహించిన సాదిక్ పాషా ఓదెల మండలానికి బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో కమాన్ పూర్ ఎంపీడీవో కార్యాలయం నుండి బదిలీపై వచ్చిన యం.సురేష్ ముత్తారంలో నూతన సూపరిటెండెంట్‌గా తన బాధ్యతలను చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి,ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు.

## ముత్తారం ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ

ముగింపు దశకు మరమ్మతు పనులు!

తీరనున్న రోగుల ఇబ్బందులు

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి భవన మరమ్మతు పనులు శరవేగంగా సాగుతూ ప్రస్తుతం పూర్తి దశకు చేరుకున్నాయి.గత కొంతకాలంగా ఈ ఆసుపత్రి భవనం స్లాబ్ పాక్షికంగా దెబ్బతిని, వర్షం వచ్చినప్పుడు పైనుంచి నీరు కారుతుండేది. దీనికితోడు కిటికీలు, తలుపులు, వెంటిలేటర్లు సైతం పూర్తిగా పాడైపోవడంతో ఇక్కడకు వచ్చే రోగులు,సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఈ సమస్యలపై ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యులు డాక్టర్ అమరేందర్ రావు స్పందిస్తూ.. ఆసుపత్రి దుస్థితిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, డీఎంహెచ్ఓలు వెంటనే ఆసుపత్రికి మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిధులు మంజూరై,గత కొద్దిరోజులుగా ఆసుపత్రి మరమ్మతు ప్రక్రియ అత్యంత వేగంగా కొనసాగుతోంది.ఇందులో భాగంగా భవన మరమ్మతులతో పాటు ఆసుపత్రిలోని విద్యుత్తు వ్యవస్థ పునరుద్ధరణ, నిరంతర త్రాగునీటి సౌకర్యం,మరుగుదొడ్ల ఆధునీకరణ వంటి తదితర కీలక మరమ్మతు పనులను కూడా వేగంగా పూర్తి చేస్తున్నారు.ప్రస్తుతం ఈ పనులన్నీ చివరి దశకు చేరుకున్నాయి. భవనానికి కొత్త రూపు వస్తుండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రి మరమ్మతులు పూర్తి కావస్తుండటంతో ఇకపై రోగులకు వైద్య సదుపాయాలు,ఇతర వసతులు మరింత మెరుగ్గా అందనున్నాయి.

## బోనం వేడుకల్లో డైరెక్టర్ ఆపరేషన్స్

**ప్రజాపక్షం/రామగిరి :** అడ్రియాల లాంగ్ వాల్ గని ఆవరణలో శ్రీ శక్తి మాత, అడ్రియాల పోచమ్మ అమ్మ వార్లకు బుధవారం బోనాలను సమర్పించే వేడుకల్లో డైరెక్టర్ ఆపరేషన్ ఎల్.వి.సూర్య నారాయణ పాల్గొని బోనం సమర్పించడం జరిగింది.వారితోపాటు అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, రామగుండం 2 ఏరియా జనరల్ మేనేజర్ టి. లక్ష్మీ పతి గౌడ్, ఏరియా ఇంజినీర్ వి.డూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.జనార్థన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ టి.రఘురామ్, మేనేజర్ పెంచల య్య, సంక్షేమ అధికారి మధు, పిట్ సెక్రెటరీలు గంగాధర్, కొమురయ్య, లతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు,పాల్గొన్నారు.

## సింగరేణికి క్లిష్ట పరిస్థితి

వెల్లడించిన జనక్ ప్రసాద్

**ప్రజాపక్షం/రామగిరి :** సెంటినరీ కాలనీలోని ఐఎన్టీయూసి కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. 127 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించి సంస్థకు తీవ్ర నష్టం కలిగించారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అర్జీ–3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు నర్సింహా రెడ్డి, ధర్మపురి, అర్జీ–1 వైస్ ప్రెసిడెంట్ సదానందం, అర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రెడ్డి, కేంద్ర కార్యదర్శులు గడ్డం తిరుపతి, ఎల్లంకి రామారావు, మద్దీ రాజకుమార్, బిక్క నాయక్, బ్రాంచ్ కార్యదర్శులు సాయికృష్ణ, పిట్ సెక్రటరీలు ఓసీ–1 ప్రవీణ్ రెడ్డి, సదానందం, ఓసీ–2 మనోహర్, కేన్ చారి, ఏఎల్పి కొమురయ్య, ఎస్ఎస్‌పిసి రమేష్, నాయకులు కందే రవి,బుద్దే సదానందం, గిరవేణి కొమురయ్య, మేకల మారుతీ, బత్తుల శంకర్, ప్రేమ్, పాల్గొన్నారు.

# ఫార్వర్డ్ బ్లాక్‌లో భారీగా చేరికలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి పట్టణంలోని 25వ వార్డుకు చెందిన పలువురు యువకులు బుధవారం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు.కుక్క చరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు కొలిపాక శ్రీనివాస్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ అణగారిన వర్గాలంతా ఐక్యంగా నిలిస్తే రాజ్యాధికారం సాధించడం సాధ్యమవుతుందన్నారు.పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ టౌన్ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్, కుక్క కనక రాజు,మెహరాజ్, 25వ వార్డు సభ్యుడు మాచర్ల సాగర్, కుక్క అజయ్, కుక్క ఆదర్శ్, కుక్క శ్రావణ్, పేర్క నరేష్, చిలుక శశికుమార్,ఈర్ల గోపిచంద్, కుక్క రాజు,కుక్క దేవయ్య,కుక్క లక్ష్మ య్య, కుక్క రామస్వామి, ఈర్ల సాయి ప్రసన్న,రామగళ్ల ధనశ్రీ,కుక్క జీవన్,ఈర్ల నితిత,కుక్క సౌమ్య, చిలుక మల్లిక,ఇరుగురాల సుమలత,బొంకూరి నిర్మల, కుక్క విజయ,తుంగపిండి సుకన్య, పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్ భవనాన్ని సందర్శించిన తహసీల్దార్



**ప్రజాపక్షం/రామగిరి :** కమాన్పూర్ మండల కేంద్రంలోని తాసిల్దార్ నూతన భవనాన్ని తహసీల్దార్ వాసంతి తో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ సందర్శించారు. వారి వెంట మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా తాసిల్దార్ ఆఫీస్ అద్దె భవనంలో ఉండగా ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకొని తాసిల్దార్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించి,త్వరితగతిన భవన నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్కు మంత్రి ఆదేశించడంతో వెంటనే తాసిల్దార్ కార్యాలన్ని పూర్తి చేయడం జరిగింది త్వరలో తాసిల్దార్ కార్యాలన్ని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రారంభిస్తారు అని తెలిపారు.

## ఎకో పార్క్, నర్సరీని పరిశీలించిన ఫారెస్ట్రీ అడ్వైజర్

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం3 ఏరియాలో అభివృద్ధి చేస్తున్న ఎకోపార్క్‌ను బుధవారం సింగరేణి ఫారెస్ట్రీ అడ్వైజర్ మోహన్ చంద్ర ఫర్గెన్, రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ సుంకర మధుసూదన్ కలిసి పరిశీలించారు.ఎకో పార్కులో జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించి,మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం ఆర్.జి.త్రీ ఏరియా నర్సరీని పరిశీలించి, ఈ సంవత్సరం ప్లాంటేషన్‌కు ఉపయోగపడే నాణ్యమైన మొక్కలను సార్టింగ్, గ్రేడింగ్ చేసి ప్రత్యేకంగా ఉంచాలని సూచించారు.ఈ ఏడాది ప్లాంటేషన్ అవసరాలకు వినియోగించిన తర్వాత మిగిలిన మొక్కలను పెద్ద సైజు బ్యాగుల్లోకి మార్చి, వచ్చే సంవత్సరం, ఆపై సంవత్సరాల ప్లాంటేషన్ కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా సంరక్షించాలని సూచించారు.అదేవిధంగా ఏరియాలో చేపడుతున్న ఓబీ దంప్ ప్లాంటేషన్ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మొక్కలు, కూలీల రవాణాకు ఆటంకం లేకుండా సంబంధిత ప్రాజెక్ట్ అధికారులు ఓబీ దంపులపై అవసరమైన అప్రోచ్ రోడ్లను ఎప్పటికప్పుడు ఏర్పాటు చేసి,సీజన్‌ను సద్వినియోగం చేసుకుంటూ ప్లాంటేషన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ పరిశీలనలో ఫారెస్ట్రీ ఏజీఎం శ్రీ బానోత్ కర్ణ, ఫారెస్ట్ అధికారిణి కుమారి మేఘన, పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతుల్లో ఆనందం

అంచనాలను మించిన దిగుబడులు మంచి ఆదాయం

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అంచనాలకు మించిన దిగుబడితో ఆయిల్ పామ్ రైతులు ఆనందంతో ఉన్నారని జిల్లా ఉద్యానవన అధికారి గద్దం శ్యాం ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయిల్ పామ్ తురకల మద్దికుంట గ్రామానికి చెందిన రైతు కీర్తి శ్రీనివాస్ మొదటి కోత నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు మంచి దిగుబడులు, ఆశాజనకమైన ఆదాయం లభిస్తుండటంతో రైతుల్లో ఆనందం నెలకొందని, రైతులు ఊహించిన దానికంటే మెరుగైన రాబడులు పొందుతూ ఆయిల్‌పామ్ సాగుపై మరింత ఆసక్తి చూపుతున్నారని,తెలంగాణ ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ రైతులకు వివిధ రకాల రాయితీలు, సబ్సిడీలను అందిస్తోందని, రైతులు ప్రస్తుత వర్షాపాతాన్ని మాత్రమే నమ్ముకుని అధిక నీటి అవసరం ఉన్న వరి సాగు వైపు వెళ్లకుండా, భవిష్యత్‌లో స్థిరమైన ఆదాయాన్ని అందించే ఆయిల్‌పామ్ వంటి పంటల వైపు దృష్టి సారించాలని,ఆయిల్‌పామ్ అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుని నిలబడగల పంట. ఇది దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే పంటగా నిలుస్తుందని పెద్దపల్లి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గద్దం



శ్యామ్ ప్రసాద్ తెలిపారు.ఈ కార్యక్రమం లో గద్దం శ్యామ్ ప్రసాద్,జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి, పెద్దపల్లి, తిరుమల ఆయిల్ పాం కంపెనీ కేష కల్యాంకర్ ,రాము,ఆయిల్ పాం ఫీల్డ్ స్టాఫ్, రైతులు, పాల్గొన్నారు.

# చైర్మన్ జిందం కళచక్రపాణికు సత్కారం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** జాతీయ చేనేత దినోత్సవంను పురస్కరించుకొని తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో కరీంనగర్ లో నిర్వహించిన చైతన్య మహాసభలో బుధవారం సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళచక్రపాణిని తెలంగాణ పద్మశాలి సహకార కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సర్పంచ్

**ప్రజాపక్షం/ముస్తాబాద్:** ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనన్ని గ్రామ సంక్షేమంలో భాగంగా బుధవారం స్థానిక సర్పంచ్ పెద్దిగారి యాదమ్మ శ్రీనివాస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో భోజన తయారీ విధానాన్ని, వంట గది శుభ్రతను, వాడే పదార్థాల నాణ్యతను ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# సైబర్ సురక్షిత తెలంగాణను నిర్మిద్దాం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** విద్యార్థి దశ నుండే సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పలికి కలిసి సైబర్ సురక్షిత తెలంగాణను నిర్మిద్దామని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు విద్యార్థులతో కలిసి సైబర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సైబర్ మోసాల పట్ల ప్రజలను, విద్యార్థులను అప్రమత్తం చేసి, సురక్షితమైన డిజిటల్ వినియోగంపై చైతన్యం కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే, ముఖ్యంగా గోల్డెన్ అవర్ (మొదటి గంట)లోనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు కాల్ చేసి లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని,గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్పీ సూచించారు. ఈకార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు,సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లు గణేష్, నాగరాజు, జునైద్, సైబర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కుర్ర రాకేష్, మంద అనిల్ కుమార్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఇతర సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుర్ర రాకేష్ మంద అనిల్ కుమార్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం చేపట్టి ఏవో రామ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, పుస్తకాలు, స్టేషనరీ, దుప్పట్లు, పడకలు, యూనిఫాంలు, అవసరమైన ఇతర సామగ్రి సకాలంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల వసతి గృహాల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని తెలిపారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోవడం, తాగునీటి కొరత, నీటి సరఫరా సమస్యలు, విద్యుత్ అంతరాయాలు, ఫ్యాన్లు పనిచేయకపోవడం, పరిశుభ్రమైన వాతావరణం లేకపోవడం వల్ల విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. జిల్లాలోని గురుకుల, సంక్షేమ అనేక హాస్టళ్లు ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, దీంతో విద్యార్థులకు సరైన వసతి కల్పించడం సాధ్యం కావడం లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పెండెల అధిత్య, గర్ల్స్ కన్వీనర్ బర్రెంకల శ్రీహారిక, కో కన్వీనర్ బోధను ప్రవళిక నాయకులు భూక్యా సందీప్, శశి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# సుమిత్ర శ్రీ, శివాని కళాశాలల్లో ఘనంగా 'ఫ్రెషర్స్ డే'




**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని సుమిత్ర శ్రీ ఒకేషనల్ కళాశాల, శివాని పారామెడికల్ కళాశాల ప్రాంగణంలో ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం కళాశాల కరస్పాండెంట్లు మడ్డి స్వప్న, శేఖర్‌ల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేములవాడ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, అమృత నర్సింగ్ హోమ్ ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆనంద్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు అన్ని రకాల సృజనాత్మక రంగాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆకాంక్షించారు. ప్రతియేటా సుమిత్ర శ్రీ, శివాని కళాశాలల యాజమాన్యం విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేలా వేడుకలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం నూతనంగా చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థి–విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి మోడల్ వాక్ చేయడంతో పాటు చేసిన పలు నృత్య రూపకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు హాజరైన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది లత, పద్మ, మమత, వర్ష, ప్రతిభ, ప్రణయ్‌లతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పారమితలో ఘనంగా ఎన్‌థ్రోన్‌మెంట్ వేడుకలు




**ప్రజాపక్షం/కొత్తపల్లి:** స్థానిక జ్యోతినగర్‌లోని పారమిత ఎక్స్‌ప్లోరికా పాఠశాలలో విద్యార్థి నాయకుల ఎన్‌థ్రోన్‌మెంట్ వేడుకలను ఘనంగా బుధవారం నిర్వహించారు. ఇటీవల పాఠశాలలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థి ప్రతినిధులు ఈ సందర్భంగా అధికారికంగా తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే స్కూల్ కౌన్సిల్ డిప్యూటీ హెడ్ బాధ్యతలను స్వీకరించి విధేయతతో సేవలందిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పిల్లలు నాయకత్వ బాధ్యతలు స్వీకరించడాన్ని గర్వంగా వీక్షించారు. ప్రమాణ స్వీకారం అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, ఇతర కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచన, క్రమశిక్షణ, సేవాభావం, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అనుకర్ రావు, వియుయం ప్రసాద్, రశ్మిత, వినోద్ రావు, రాకేశ్, ప్రసూన, ప్రాచీ, ప్రధానోపాధ్యాయులు శర్మిష్ట, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డిగ్రీ కాలేజీలో మధ్యాహ్న భోజనం ప్రారంభించిన ప్రిన్సిపల్



**ప్రజాపక్షం/జమ్మికుంట :** విద్యార్థులు ఇష్టపడి బాగా చదువుకోవాలని భవిష్యత్‌లో మంచి ప్రయోజకులుగా ఎదగాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.రమేశ్ అన్నారు. బుధవారం కళాశాలలో సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ యాజమాన్యం డా.కె.తిరుపతి, డా.కె.స్వర్ణలత సహకారంతో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.రమేశ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ మధ్యాహ్న భోజన పథకం వరుసగా మూడవ సంవత్సరం కొనసాగించడం చాలా ఆనందంగా ఉందన్నారు. గత రెండు సంవత్సరాల్లో శ్రీ బచ్చు భాస్కర్, శ్రీరామ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం డా.రాము, డా.శ్రీవాణి, డా.శ్రీనివాస్, డా.రాణి సహకారం అందించారని వారికి కూడా ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనం అందించడం ద్వారా క్లాసులలో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని దాంతోపాటు అడ్మిషన్లు కూడా గణనీయంగా పెరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.ఎస్.ఓదెలు కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ డా.కే.రాజేంద్రం, డా.కె.గణేశ్, డా.శ్యామల, డా.కె.మాధవి, కే.ఉమాకిరణ్, వి.కిరణ్ కుమార్, ఎన్.మమత, పి.శ్రీనివాస్ రెడ్డి, ఎల్.రవిందర్, డా.పి.సుష్మ, డా.పి.రవిప్రకాశ్ రావు, డా.ఎన్.శ్రీనివాస్, ప్రశాంత్, రమేశ్, శ్రీకాంత్, సాయికుమార్, అరుణ్ రాజు, అనూష, డా.పి.స్వప్న, దీనా, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ సిబ్బంది వేతనాలు వెంటనే చెల్లించాలి

గుంటి వేణు



**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా రూ. 12,000 మంది ఉపాధి హామీ సిబ్బందికి వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి, సిపిఐ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు వినతి పత్రం అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత మూడు నెలల నుండి నిధుల బకాయిలు చెల్లించడం లేదని గ్రామీణ ప్రాంతాలలో వలసలను నివారించి స్థానిక కూలీలకు ఉపాధి కల్పించే రంగంలో కీలకంగా పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు మరియు కంప్యూటర్ ఆపరేటర్లకు ఇతరత్ర టెక్నికల్ వర్కర్స్ కు గత మూడు నెలల నుండి వేతనాలు ఇవ్వకపోవడం వల్ల వారు మరియు వారి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటు కాలం వెళ్లదీస్తూ ఉన్నారు. క్షేత్రస్థాయిలో పనులను గుర్తించి ప్రభుత్వ లక్ష్యాన్ని చేరే విధంగా మీరు పని చేస్తూ ఉన్నారు. స్థానిక కూలీలకు పనులు కల్పిస్తూ, పని ప్రదేశాలలో ఫోటోలు తీయడం ఎప్పటికప్పుడు జరిగిన పనులను ఆన్లైన్లో ఎక్కించడం వీరు చేస్తారని కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి సకాలంలో వేతనాలు అందించడంలో విఫలం చెందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనా వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాళ్లకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, లేనియెడల రాబోయే కాలంలో సిబ్బందితో కలిసి ఉద్యమాలు చేస్తామని సిపిఐ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు పేర్కొన్నారు.

# ఉపాధి హామీ పనులను పర్యవేక్షించిన నోడల్ అధికారి

**ప్రజాపక్షం/జమ్మికుంట:** మండలంలోని కోరపల్లి గ్రామంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనిలో భాగంగా వరద నీటిని కాలువల ద్వారా చెరువులో చేరవేసేటువంటి జల సంరక్షణ పనులు జరగగా అట్టి పనులను కేంద్ర ప్రభుత్వం కరీంనగర్ జిల్లా నోడల్ అధికారి డి.చైతన్య బుధవారం పరిశీలించారు. అట్టి పనులను జిపిఆర్ఎస్ ట్యాగ్ ద్వారా పరిశీలించి పని చేసిన ప్రకారం గతంలో ఏదైతే పని జరిగిందని కూలీలకు డబ్బులు చెల్లించి ఎంబి రికార్డు చేసినారో ఏరియాను గుర్తించి పని జరిగిందని అట్టి పని బాగా జరిగిందని ఉపాధి హామీ పనుల బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందికట్ల మధుసూదన్, పంచాయతీ కార్యదర్శి కెటీ రామారావు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ కవిత పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం కోసం వినతి

**ప్రజాపక్షం/చొప్పదండి :** మండల కేంద్రంలో తెలంగాణ వీరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గౌడ కుల సంఘం, గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. పట్టణంలో ఇప్పనపల్లి హరికిషన్ హైస్కూల్ గేట్‌కు ఎదురుగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ముందుగా చొప్పదండి ఎంపిడివో కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ కె.నాగరాజులకు కూడా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గౌడ్ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా పట్టణ సుందరీకరణతోపాటు చారిత్రక ప్రాముఖ్యత ఉన్న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శప్రాయమని, భవిష్యత్ తరాలకు ఆయన చరిత్ర తెలిసేలా విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు బుర్ర మల్లేశం గౌడ్, మాజీ గౌడ సంఘం అధ్యక్షుడు పెరుమండ్ల గంగయ్య, యువజన సంఘం అధ్యక్షులు బోగిగె సాయికృష్ణ, నాయకులు ముద్దం తిరుపతి, బోడిగె శ్రీనివాస్, బోడిగే వెంకటేశ్ బత్తిని శంకరయ్య, ఆరెల్లి తిరుపతి, యువజన సంఘం సభ్యులు, గౌడ్ కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్మికుల విజయమే మణుగూరు బొగ్గు బ్లాక్ కేటాయింపు

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : నిరంతరం కార్మికుల పక్షాన బిఎంఎస్ చేసే పోరాటాల ఫలితంగానే మణుగూరు పికె ఓసి–II డీప్ సైడ్ ఎక్స్‌టెన్షన్ బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని, ఇది కార్మికుల విజయమని బిఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కె 5 గని వద్ద కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి, బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జ్ కొత్తకాపు లక్ష్మీ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ బొగ్గు బ్లాక్ ద్వారా సుమారు 35–40 సంవత్సరాల పాటు ఉత్పత్తి కొనసాగే అవకాశం ఉందని, 860 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీనివల్ల దాదాపు 3,000 మంది శాశ్వత కార్మికులకు ఉద్యోగ భద్రత లభించడంతో పాటు సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు సమకూరుతాయని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కొత్త గనులను సింగరేణికి కేటాయించేలా బిఎంఎస్ కృషి చేస్తుందన్నారు. ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజారామ్ కిరణ్ కుమార్, అప్పాల బీరయ్య, చల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్త వహించాలి

ప్రజాపక్షం/కాగజ్ నగర్ : వర్షాకాలంలో విద్యుత్ స్తంభాల వద్ద ఉండరాదని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డివిజనల్ ఇంజనీర్ వీరేశం అన్నారు. బుధవారం కాగజ్ నగర్ మండలంలోని నజురుల్ నగర్ విలేజ్ నంబర్ వన్‌లో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొలంబాటలో వదులుగా ఉన్న వైర్లను సరిచేసి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. రైతులు పొలాల వద్ద మోటార్లకు అతుకులు లేని వైర్లు ఉంచుకోవాలని, స్టార్టర్ బాక్సులు సరిచూసుకొని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవడం వల్ల అవి కాలిపోకుండా ఉంటాయని, ఓల్టేజ్ సమతూకంతో వచ్చి ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.

## బాలికల భద్రతపై షీ టీం అవగాహన

ప్రజాపక్షం/కౌటాల : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళలకు భద్రతపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాగజ్ నగర్ షీ టీం ఇన్‌చార్జి ఎఎస్ఐ సునీత విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, భద్రతా చట్టాలు, అత్యవసర సేవలు, సోషల్ మీడియా జాగ్రత్తలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వేధింపులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎదురైతే కాగజ్‌నగర్ షీ టీం చరవాని సంఖ్య 8712670565 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రామ్‌చందర్, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు రమాదేవి, శ్రీనివాస్, సునీత పాల్గొన్నారు.

# ఓటు హక్కు ప్రాధాన్యత తెలుసుకోవాలి

ప్రజాపక్షం / మంచిర్యాల: ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వర్ చరణ్ అన్నారు. మంచిర్యాల పట్టణ గోదావరి రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం మాక్ క్యాబినెట్ ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికల విధానంపై అవగాహన కల్పించడంతో పాటు ఓటు విలువను, అవినీతి అక్రమాలకు తావులేకుండా సక్రమ పద్ధతిలో ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపాల్ తెలిపారు. భారత రాజ్యాంగం ప్రకారం పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఏ విధంగా నిర్వహిస్తారో అదే తరహాలో పాఠశాల స్థాయిలో కమిటీ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. ఈ మాక్ ఎన్నికలలో హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ గర్ల్,



స్పోర్ట్స్ కెప్టెన్, సిసిఎ కెప్టెన్ స్థానాలతో పాటు హౌజ్ ఆఫ్ కింగ్స్, హౌజ్ ఆఫ్ రాయల్స్, హౌజ్ ఆఫ్ పార్సన్స్, హౌజ్ ఆఫ్ సీజర్స్ విభాగాల్లో దాదాపు 53 మంది విద్యార్థులు నామినేషన్లు వేశారు. పాఠశాలకు చెందిన సుమారు 800 నుంచి 1000 మంది విద్యార్థులు ఈ ఎన్నికలలో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దడమే శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రధాన లక్ష్యమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# కేజ్ వీల్స్ రోడ్లపై నడిపితే చర్యలు



ప్రజాపక్షం/పెంచికల్‌పేట్: ట్రాక్టర్లకు కేజ్ వీల్స్ అమర్చి ప్రజా రహదారులపై నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పెంచికల్‌పేట్ ఎస్సై అనిల్ కుమార్ హెచ్చరించారు. కేజ్ వీల్స్ కారణంగా బిటి, సిసి రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆయన తెలిపారు. వ్యవసాయ పనుల కోసం పొలాల్లో మాత్రమే వీటిని వినియోగించాలని, రహదారుల పైకి వచ్చే ముందు తప్పనిసరిగా తొలగించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై ట్రాక్టర్లు నడిపిన వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని, జరిమానాలు విధించడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. రహదారుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, రైతులు, ట్రాక్టర్ యజమానులు పోలీసులకు సహకరించాలని కోరారు.

# సరండిలో సిసి రోడ్డు పనులకు శ్రీకారం

ప్రజాపక్షం/వాంకిడి: వాంకిడి మండలంలోని సరండి గ్రామపంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.4 లక్షల నిధులతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ మొహర్లా బాపూజీ బుధవారం ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు. రోడ్లు మెరుగుపడితే రవాణా సౌకర్యాలు మెరుగవడంతో పాటు గ్రామాభివృద్ధికి బలమైన పునాదులు పడతాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని, గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రధాన లక్ష్యమని, మురుగునీటి సమస్యలు పరిష్కరించడంతో పాటు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.



ప్రజల సహకారంతో సరండిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాడి సోనం, వైర్మన్ పెంటు, వార్డు సభ్యులు దుర్గం కమలాకర్, విజయ్ మహేశ్వరి, పటేల్ మంగాజీ, రాజ్‌కుమార్, గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ సిబ్బంది సంజీవ్, యశ్వంత్ రావు, మారుతి పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కుల పరిరక్షణకు బిఆర్ఎస్ అండ

ప్రజాపక్షం/జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం నాయకపుగూడ అటవీ ప్రాంతంలో చేపలు పట్టడానికి వెళ్లిన ఆదివాసి యువకులపై అటవీశాఖ అధికారులు దాడి చేసి గాయపరిచిన ఘటన నేపథ్యంలో బిఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ బాధితులను పరామర్శించారు. ఆదివాసుల హక్కులను కాపాడేందుకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. గాయపడిన ఆదివాసి యువకుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు. ఆదివాసులపై జరిగిన ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై



తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, అటవీశాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండలానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆదివాసి ప్రజలు పాల్గొన్నారు.

# శిశువు సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే ఆధారం

ప్రజాపక్షం/వాంకిడి : శిశువు సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఎదగడానికి తల్లిపాలు ఎంతో అవసరమని, పుట్టిన వెంటనే అందించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వాంకిడి మండలంలోని బంబారా గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ తెలిపారు. బంబారా గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అత్యుత్తమ పోషకాహారమని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రతి తల్లి ఆరు నెలల వరకు శిశువుకు పూర్తిగా తల్లిపాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఫాతిమా, ఉప సర్పంచ్ జాడే సంతోష్, వార్డు సభ్యులు బుర్రి శలక్క, శ్రీరామలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి దుర్గం ధర్మయ్య, ఏఎన్ఎం సునంద, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధ్యులైన అటవీ అధికారులను అరెస్ట్ చేయాలి

ప్రజాపక్షం/జన్నారం : నాయకపుగూడ అటవీ ప్రాంతంలో చేపలు పట్టేందుకు వెళ్లిన ఆదివాసీ యువకులపై దాడి చేసిన అటవీ శాఖ అధికారులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కోవ దౌలత్ రావు మొకాశి డిమాండ్ చేశారు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి నాలుగు రోజులు గడిచినా బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం విచారకరమని ఆయన అన్నారు. బుధవారం నాయకపుగూడలో సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ఆగస్టు 9లోపు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఆగస్టు 10 నుంచి నిరవధిక ఆందోళనలు ప్రారంభిస్తామని హెచ్చరించారు. టైగర్ జోన్ పేరుతో గ్రామాలపై కొనసాగుతున్న ఆంక్షలను ఎత్తివేయాలని, అటవీ హక్కుల చట్టం–2006ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. అప్పటి వరకు అటవీ అధికారులకు ఎలాంటి సహకారం అందించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకపుగూడ గ్రామ పటేల్ మూతి రాజేందర్, ఆదివాసి సేన నాయకులు రాయిసిడం జంగు పటేల్, పేందోర్ శ్రీనివాస్, పేందోర్ శంకర్, దుర్వ యశ్వంత్, మర్సకోల సంతోష్, ఆత్రం జలపతి, ఆత్రం మహేష్, కనక మాణిక్‌రావు, కుంరం భీంరావు, పెంద్రం భీంరావు, కుంరం అరుణ్, తుంరం బోజ్జు, జుగ్నక్ గంగారాం పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తతే ఆయుధం

ప్రజాపక్షం/కెరమెరి : సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వాంకిడి సిఐ వేణుగోపాల్ అన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైబర్ జాగ్రత్త దివాస్ సురక్షకా తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం కెరమెరి మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆశను ఆసరాగా చేసుకుని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని నమ్మించి సైబర్ నేరగాళ్లు పెద్ద మొత్తంలో డబ్బులు కాజేస్తున్నారని ఆయన హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే ఏపికె ఫైళ్లు, లింకులను ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఒకవేళ సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బంది, వ్యాపారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో నవోదయ విద్యాలయాల పాత్ర కీలకం

ప్రజాపక్షం/కాగజ్ నగర్ : దేశ నిర్మాణంలో జవహర్ నవోదయ విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే విఠల్ అన్నారు. బుధవారం కాగజ్ నగర్ పట్టణంలో నిర్వహించిన జవహర్ నవోదయ 39వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నవోదయ విద్యాలయాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతను అలవర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్సీ దండే విఠల్‌ను శాలువా, జ్ఞాపికతో సన్మానించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ్ పైప్‌లైన్ మరమ్మత్తు పనులు

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్‌కు మంచినీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ భారీ వర్షాల కారణంగా దెబ్బతినగ బుధవారం మంచిర్యాల కార్పోరేషన్ మేయర్ ధర్ని మధుకర్ పనులను పర్యవేక్షించి పనులను వేగవంతం చేసి గురువారం నుండి నీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పైప్‌లైన్ పనులు నిర్వహిస్తున్న రాళ్ళవాగు ప్రాంతాన్ని మేయర్‌తో పాటు కార్పోరేటర్లు, అధికారులతో పర్యవేక్షించారు. గత వారం రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు పైప్‌లైన్ పనులు కొట్టుకుపోగా నాలుగు రోజులుగా యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వరద ప్రవాహం ఉధృతంగా మారి పనుల పురోగతికి ఆటంకం కలిగిస్తున్నప్పటికి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ఎలాగైనా నీటి సరఫరా పునరుద్ధరించాలని సంబంధిత శాఖల అధికారుల సహకారం తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, డిఇ రాజేందర్, మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అదనపు కట్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/ఎడపల్లిః** అదనపు కట్నం కోసం భార్యను వేదించిన కేసులో నిందితుడికి మూడేళ్ల సాధారణ కారగార శిక్షతో పాటు రూ.500జరిమానా విధిస్తూ బోధన్ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఈ సాయి శివ తీర్పు వెలువరించారు. ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన ఓ మహిళకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన అబ్దుల్ అజీజ్‌తో 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో ఒప్పుకున్న ప్రకారం నగదు, బంగారం ఆభరణాలు కట్నంగా ఇచ్చినప్పటికీ, పెళ్లయిన కొంతకాలం తరువాత అబ్దుల్ అజీజ్ అదనపు కట్నం తీసుకు రావాలంటూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించడమే కాకుండా బెదిరింపులకు గురి చేసేవాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. కోర్టులో విచారణ సందర్భంగా అబ్దుల్ అజీజ్‌పై అదనపు కట్నం వేదింపుల అభియోగాలు రుజువు కావడంతో అతడిని దోషిగా నిర్ధారిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ కేసులో అప్పటి ఎడపల్లి ఎస్సై ఎండి. ఆసిఫ్ ఛార్జిషీట్ దాఖలు చేయగా, ప్రభుత్వం తరపున ఏపీపీ సతీష్ గౌడ్ బలమైన వాదనలు వినిపించారు. కేసు విచారణ క్రమంలో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా వ్యవహరించి, కీలక పాత్ర పోషించిన ఎడపల్లి పోలీస్ సిబ్బందిని పలువురు అభినందించారు.

## సైబర్ జాగృతి దివస్ పోస్టర్లను విడుదల

**ప్రజాపక్షం/భైంసా :** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు ప్రజల్లో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహిస్తున్న సైబర్ జాగృతి దివస్ కార్యక్రమంలో భాగంగా, భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.జి.జ్ఞానకి షర్మిల, ఐపీఎస్ సైబర్ జాగృతి దివస్ పోస్టర్లను విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అత్యాధునిక పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్,ఇన్స్పెక్టర్లు రవీందర్ నాయక్, దీపక్,సాయి కుమార్,ఎస్ఐ లు,పోలీసు సిబ్బంది,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/లోకేశ్వరం :** మండల కేంద్రంలోని మాణిక్ రావు మాతృమూర్తి మరణించడం జరిగింది విషయము తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి అమ్మ ఆత్మ శాంతి చేకూరాలని మనోధైర్యాన్ని తెలిపారు. పరామర్శించినవారి లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్,బిఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు లోలం శ్యామ్ సుందర్,పిఎసిఎస్ మాజీ చైర్మన్ చిన్న రావు,పిఎసిఎస్ చైర్మన్ రత్నాకర్ రావు,సోషల్ మీడియా మండల కన్వీనర్ బండి ప్రశాంత్ పాల్గొన్నారు.

## ఖానాపూర్ ప్రాంతంలో విస్తృతంగా ఎక్సైజ్ దాడులు

### 6 కేసులు,ముగ్గురి అరెస్ట్.. 5,000 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం!

**ప్రజాపక్షం/పెంబి :** అసిస్టెంట్ కమిషనర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆదిలాబాద్,జిల్లా ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి నిర్మల్ గారి ఆదేశాల మేరకు బుధవారం నాటు సారాయి నిర్మూలనలో భాగంగా ఖానాపూర్ ప్రాంతంలో ఎక్సైజ్, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా విస్తృత దాడులు నిర్వహించారు.ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదిలాబాద్ బృందం, డీటీఎఫ్ ఆదిలాబాద్ బృందం, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ కేంద్రం నిర్మల్ సిబ్బందితో పాటు ఖానాపూర్ అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పరిధిలోని సింగాపూర్ పల్లె, రాజూరా పల్లె, రాజూరా గ్రామం, ఇక్బాల్‌పూర్ గ్రామాలలో ఈ తనిఖీలు చేపట్టారు.ఈ దాడుల్లో మొత్తం 6 కేసులు నమోదు చేసి, ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 25 లీటర్ల నాటు మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు సుమారు 3,000 లీటర్ల బెల్లం పానకాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అలాగే, అటవీ శాఖ అధికారుల భాగస్వామ్యంతో ఇక్బాల్‌పూర్ పొలిమేర అటవీ ప్రాంతంలో అదనంగా మరో 2,000 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించి సమూలంగా ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామి మాట్లాడుతూ.. నాటు సారాయి తయారీ, నల్లబెల్లం అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి,ఎస్ఐ అభిషేక్, ఎస్ఐ సింధు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నరేందర్ తో పాటు ప్రొహిబిషన్ & ఎక్సైజ్, అటవీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## నగర సమగ్రాభివృద్ధే లక్ష్యం

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. బుధవారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా... ఈ రేవంత్ సర్కార్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నయాపైసా ఇవ్వడం లేదన్నారు. నగర మేయర్, కార్పొరేషన్ కమిషనర్ నగరంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిజామాబాద్ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ వైద్య, రవాణా, ఐటి శాఖల మంత్రులను కలిసి పలు అంశాలపై వినతి పత్రం సమర్పించామన్నారు. ప్రధానంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసి నిజామాబాద్ ట్రాఫిక్ సమస్యను తీర్చే దిశగా రూ. వంద కోట్లతో నాందేవ్‌వాడ, దేవి రోడ్డు, రైల్వే స్టేషన్ అదనపు వంతెన నిర్మించాలని ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి అందజేస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిజామాబాద్




అభివృద్ధిని వేగవంతం చేయాలన్నదే తన ప్రయత్నమన్నారు. ఎంపి అరవింద్‌తో కలిసి అనేక ప్రతిపాదనలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మినారాయణ, పోతన్‌కర్ లక్ష్మినారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, జ్యోతి మురళి, శ్యామల సత్యపాల్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, పసునూరి రాము, భట్టు రాఘవేందర్, ఎస్‌సి మోర్చా నాయకులు జస్పాల్ సింగ్, బాబీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సైబర్ జాగృతి దివస్‌లో పాల్గొన్న సిపి

**ప్రజాపక్షం/మాక్లూర్ :** జాతీయ సైబర్ జాగృతి దివాస్‌లో భాగంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు' రాష్ట్రవ్యాప్త సైబర్ అవగాహనలో భాగంగా బుధవారం నగరంలోని విజయ రూరల్ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించగా సీపీ సాయిచైతన్య పాల్గొని సైబర్ అవగాహన సిబ్బందితో, విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ప్రతిజ్ఞ చేసి మాట్లాడారు. నేటి డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందో అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ప్రతి పౌరుడు 'బి అలర్ట్ బి అవేర్ బి సేఫ్' అనే సూత్రాలను పాటిస్తూ అప్రమత్తతే రక్షణ ధృవీకరణే భద్రత అవగాహనే



ఆయుధమనే' సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని సీపీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఏసీపీ ప్రకాష్ యాదవ్, సిఐ శ్రీనివాస్, ఎస్సై అనిల్‌కుమార్, సైబర్ క్రైమ్ ఎస్సైలు మొఖీద్‌పాషా, రవికుమార్, ప్రవళి, సిబ్బంది, విజయ రూరల్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గణేష్, సురేష్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ముత్యాల చెరువు సర్వేను అడ్డుకున్న ముంపు గ్రామాల ప్రజలు

### ముత్యాల చెరువు నిర్మాణంతో పొంచి ఉన్న ప్రమాదం

### ముత్యాల చెరువు రిజర్వాయర్‌గా మార్చండి లేదా నిర్మాణ పనులు ఆపివేయండి

**ప్రజాపక్షం/నిజామాబాద్ రూరల్‌:** ధర్పల్లి మండలం వాడీ గ్రామంలోని ముత్యాల చెరువు సర్వేను నిలిపివేయాలని ఆ చెరువుతో నష్టపోయిన గ్రామాలను ఆదుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను అడ్డుకున్నారు. బుధవారం మండలంలోని వాడీ, హొన్నాజీపేట్, బీరప్ప తండా గ్రామాల ప్రజలు రోడ్డుపై బైఠాయించి చెరువు కట్ట మరమ్మతులు నిలిపివేయాలని నిరసన తెలిపారు. ముత్యాల ప్రాజెక్టు నిర్మాణం పాత డిజైన్ ప్రకారం చేపడితే ప్రాణనష్టంతో పాటు ఆస్తి, పంట నష్టం జరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుతో మాకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. చివరకు కింద ఉన్న చెరువులు నింపడానికి కూడా అక్కడి ప్రజలు సహకరించరని అధికారులకు వివ



రించారు. ఈ విషయాన్ని జిలా కలెక్టర్, రూరల్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని అయిన మళ్లీ సర్వే చేయటం ఏంటని ప్రశ్నించారు. రిజర్వాయర్‌గా మార్చండి లేదా నిర్మాణ పనులు ఆపివేయండన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మద్దికుంట ఆశవ్వ, గంగామోహన్, ఉపసర్పంచ్ సురేందర్‌రెడ్డి, గ్రామస్తులు లింగాపురం సాయిలు, సురేష్, రోండ్ల నర్సారెడ్డి, రాఘవేందర్, కర్క గంగాధర్, తెడ్డు సాయికుమార్, కృష్ణ, సాయిరాం, సుమన్, వినోద్, గంగామోహన్, మహిళలు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/భైంసా :** బి సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాదులో బుధవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కలిశారు.నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలపై వారిద్దరి మధ్య చర్చ జరిగింది.సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రికి ఎమ్మెల్యే వివరించారు.తానూర్ మండలంలోని బోసి బీసీ సంక్షేమ వసతి గృహ నిర్మాణానికి తక్షణమే కోటీ 70 లక్షల నుంచి రెండు కోట్ల రూపాయల వరకు మంజూరు చేస్తున్నట్లు మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే వెల్లడించారు.అదేవిధంగా పలు పనులకు సంబంధించిన అంశాలను చెప్పారు.

## గొప్ప కవి ప్రతిభను గుర్తించలేకపోయాం..

### పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/ఎడపల్లిః** కవి, డాక్టరేట్ గ్రహీత డాక్టర్ తాళ్ల లక్ష్మీ నారాయణ గౌడ్ ప్రతిభను సమాజం సరిగా గుర్తించలేకపోవడం నిజామాబాద్ జిల్లా దురదృష్టకరమని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తాళ్ల విజయ కుమార్ గౌడ్ తండ్రి, ప్రముఖ కవి తాళ్ల లక్ష్మీ నారాయణ గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో బుధవారం పిసిసి అధ్యక్షుడు లక్ష్మీనారాయణ గౌడ్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షుని వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, గడుగు గంగాధర్, దయాకర్ గౌడ్, ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాస్, రాధాకిషన్ గౌడ్, ఎడపల్లి మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవల తీరును సమీక్షించారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది పనితీరు, ఇతర సౌకర్యాల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ సిటీ స్కాన్ యంత్రం పనిచేయకపోవడం, ఎక్స్‌రే ఫిలింల కొరత ఉండడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ స్థానిక కౌన్సిలర్ గంజి రాజు,కౌన్సిలర్లు జింక సూరి, శ్రీరామోజు నరేష్, ఈశ్వర్,అర్జున్,విఠల్, సూరజ్, సాత్విక్, జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి,బీజేపీ నాయకులు జుట్టు దినేష్, జాప ప్రసాద్, కందుల హరీష్,అచ్యుత్ రావుతో పాటు వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చొరవతో ఐసిడిఎస్ భవనం తక్షణమే మంజూరు

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ లో గల ఐసీడీఎస్ కు ప్రభుత్వ భవనం లేకపోవడంతో వార్తలో ప్రచురితమైన ఐసీడీఎస్ కార్యాలయం తరలింపు వార్తకు తక్షణమే స్పందించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం హుటాహుటిన మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్కని కలిసి బోథ్ లో ఐసీడీఎస్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. తక్షణమే స్పందించిన మంత్రి సీతక్క సెక్రటరీ సృజన కి చరవాణిలో మాట్లాడి వెంటనేఅందుబాటులో ఉన్న గ్రాంట్ల నుంచి తక్షణమే బోథ్ లో ఐసీడీఎస్ నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంత్రి సీతక్క కు కృతజ్ఞతలు తెలిపారు.వారి వెంట మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఉన్నారు.

# సామాజిక ఐక్యత, అక్షరాస్యత లపై నాటక ప్రదర్శనలు

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలో సింగరేణి ఆధ్వర్యంలో సామాజిక ఐక్యత, చైతన్యం, అక్షరాస్యతలను పెంపొందించే లక్ష్యంతో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఏరియాలోని నస్పూర్ సిఇఆర్ క్లబ్ ప్రాంగణంలోని గోదావరి ఫంక్షన్ హాల్‌లో ఈ ప్రదర్శనలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఆగస్టు 8, శనివారం సాయంత్రం 6.30 గంటలకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత విశేషాల ఆధారంగా రూపొందించిన 'సంఘం శరణం గచ్ఛామి ఆగస్టు 9, ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు మహాత్మా జ్యోతిరావుపూలే జీవితాన్ని ప్రతిబింబించే సత్యశోధన నాటకాన్ని ప్రదర్శించనున్నారని తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి:** జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలో జాతీయ సైబర్ జాగృతి దివస్‌లో భాగంగా ఎస్‌బిఐ బ్యాంక్‌లో బ్యాంకు వినియోగదారులకు పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై జి.మహేష్ మాట్లాడుతూ.. బ్యాంకు వినియోగదారులకు, సిబ్బందికి సైబర్ మోసాలపై అవగాహన కల్పించామన్నారు. స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ గురించి వివరించామన్నారు. అధిక లాభాల పేరుతో మోసగాళ్లు చేస్తున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ధ్రువీకరించని పెట్టుబడి పథకాలలో డబ్బు పెట్టవద్దని సూచించారు. అనంతరం వారితో ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ ప్రతిజ్ఞ చేయించారు.

## మన ఊరు మన భద్రతపై అవగాహన

**ప్రజాపక్షం/బాల్కొండ :** ప్రభుత్వ జూనియర్ కళాశాల బాల్కొండలో మన ఊరు మన భద్రత మన బాధ్యత అనేకార్యక్రమంలో బాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై శైలేందర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా మంచి మార్గంలో ఉంటూ దేశ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర ఎక్కువగా ఉన్నందున చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా ఉండాలని కోరారు.

## రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** భారత రాజ్యాంగ పరిరక్షణ, ప్రాథమిక హక్కుల రక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రముఖ సామాజిక కార్యకర్త, అడ్వకేట్ ఎం.ఎ. బషీర్ పిలుపునిచ్చారు. ఇటీవలే ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత నిరసనలో ఎం.ఎ బషీర్ పాల్గొన్నారు. అనంతరం ఆదిలాబాద్ నుంచి ఛత్రపతి శంభాజీనగర(ఔరంగాబాద్)కు వెళ్లిన ఆయన, కక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కేను, ఆయన తండ్రి భగవాన్ రావు దిప్కేను వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాజ్యాంగం అందించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి సూత్రాలను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన శాంతియుత నిరసనలపై ఈ సందర్భంగా చర్చించారు.

# ప్రజల్లో దేశభక్తి పెంపొందించడానికి హర్ ఘర్ తిరంగా

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఘర్ ఘర్ తిరంగా.. హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజకవర్గ పరిధిలోని ఎడపల్లి మండల కేంద్రంలో ఉన్న శ్రీ వాగ్దేవి పాఠశాలలో బిజెపి పార్టీ అధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు జాతీయ జెండాలను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో, ప్రజల్లో దేశభక్తి భావనను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ అభియాన్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగుర వేసి దేశ ఘనతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా రాష్ట్ర కోశాధి



కారి ఆమంద విజయ్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు వంశీగౌడ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు, ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రాంచందర్, జిల్లా పార్టీ నాయకులు కూరెళ్ల శ్రీధర్, పిల్లి శ్రీకాంత్, బిసి మోర్చా జిల్లా నాయకులు నాయిని లక్ష్మణ్ గౌడ్, బిజెపి ఎడపల్లి మండల అధ్యక్షులు కోల ఇంద్రకరణ్, పార్టీ నాయకులు మల్లెపూల శ్రీనివాస్, జనగాం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం హర్షణీయం



**ప్రజాపక్షం/మోర్తాడ్:** మోర్తాడ్ మండల కేంద్రంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం హర్షణీయమని మోర్తాడ్ సర్పంచ్ భోగ నిత్యానంద్ పేర్కొన్నారు. మోర్తాడ్‌లో నిర్వహిస్తున్న 72వ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మహిళా జట్టు శిక్షణ శిబిరాన్ని సర్పంచ్ నిత్యానంద్ పరిశీలించి మాట్లాడారు. గత రెండు రోజులుగా ఈ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారని, ఈ శిక్షణ శిబిరం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపాలని సూచించారు. క్రీడాకారులకు వసతి, భోజన సదుపాలన్నీ కల్పించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలికల హాస్టల్ ఇన్‌ఛార్జి మేడమ్ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రభాకర్, బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి బోనగిరి శ్యామ్, నిర్వహణ కార్యదర్శి నాగేష్, పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్, రవి, దీపిక పాల్గొన్నారు.

# టిబిజికెఎస్‌లోకి 16 మంది కార్మికుల చేరిక

**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని టిబిజికెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియాలోని సివిల్ డిస్ట్రిబ్యూషన్ విభాగానికి చెందిన 16 మంది కార్మికులు బుధవారం ఆయన సమక్షంలో టిబిజికెఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, నాయకుడు గాలిపెల్లి తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో రాజిరెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త గనులు ప్రారంభం కాకపోవడం, కొత్త ఉద్యోగాల భర్తీ నిలిచిపోవడంతో కార్మికుల్లో ఆందోళన నెలకొందన్నారు. కార్మికుల సంఖ్య తగ్గిపోతున్నప్పటికీ కొత్త నియామకాలు చేపట్టడం లేదని, డిపెండెంట్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, బదిలీల సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బాధ్యులు వెంటనే కార్మికుల హక్కులు, సంక్షేమ సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. టిబిజికెఎస్‌లో గోవిందుల శ్రీనివాస్, బండి సదానందం, ఎండి సముద్దీన్, వి. రాజయ్య, మాస్ లచ్చన్న, మోతె నరేష్, బండి వెంకటేష్, సాంబశివుడు, డి. పున్నం, బి. గణపతి, దుర్గం శంకర్, ఎం. శివరాజు, రావుల శ్రీను చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, ఎండీ అబ్బాస్, కరుకూరి రామచందర్ పాల్గొన్నారు.

# ఓపెన్ స్కూల్ ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** పాఠశాల విద్యను మధ్యలోనే నిలిపివేసిన వారు, ఉద్యోగులు, గృహిణులు తెలంగాణ ఓపెన్ స్కూల్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ విద్యను పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరిత పిలుపునిచ్చారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2026–27 విద్యా సంవత్సర ప్రవేశాల ప్రచార పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఛాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువుకు దూరమైన ప్రతి ఒక్కరినీ విద్యావంతులుగా తీర్చిదిద్దడమే ఓపెన్ స్కూల్ లక్ష్యమన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేయాలనుకునే అర్హులైన అభ్యర్థులు సమీపంలోని అధ్యయన కేంద్రాలను సంప్రదించి ప్రవేశాలు పొందాలని సూచించారు. అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు ప్రవేశాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ యువరాజ్ మర్మట్, జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, పరీక్షల సహాయ కమిషనర్ జనార్ధన్, ప్లానింగ్ కోఆర్డినేటర్ అబ్దుల్ లతీఫ్, జిల్లా సైన్స్ అధికారి కటకము మధూకర్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## ఆదివాసీల హక్కులు, సంస్కృతి పరిరక్షణకు కట్టుబడి ఉండాలి

**ప్రజాపక్షం/మందమర్రి :** ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆదివాసీ కోయ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిడెం అశోక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ ఆదివాసీల హక్కు అని, సంస్కృతి, సంప్రదాయాలు, గుసాడి నృత్యం, గుర్తింపును కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆదివాసీ సోదరులు, వివిధ సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కోయ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అలం సాకారం, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు మడవి మల్లేష్, రాయ్ సెంటర్ సర్మేడి పోర్తేటి ప్రభాకర్, సర్పంచ్ పోర్తేటి వెంకటేష్, నాయకులు కొడప పుల్లయ్య, మడ్పా శ్రీనివాస్, తలండి మధుకర్, మాడవి ప్రసాద్, పోర్తేటి సర్దాజీ లచ్చయ్య, కూడ్మెత తిరుపతి, సీడెం భాస్కర్ ఉన్నారు.

## సహారా బాధితులకు మద్దతుగా నిరాహారదీక్ష

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** దేశరాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద సహారా బాధితుల ఆందోళనకు మద్దతుగా బుధవారం మంచిర్యాలలోని సహారా బాధితులు ఒక రోజు నిరాహార దీక్ష నిర్వహించారు. స్థానిక గాంధీపార్కు ఆవరణలో సహార ఇండియా బాధితులు ఒక్కరో జు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహారా ఇండియా బాధితులు మాట్లాడుతూ, ఢిల్లిలోని జంతర్‌మంతర్ వద్ద ఈ నెల 5,6,7 తేదీలలో దేశంలోని 13 కోట్ల మంది సహారా ఇండియాలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి మూడు నాలుగు సంవత్సరాలు గడుస్తున్న పెట్టుబడిదారులకు బకాయిపడిన దాదాపు 40 వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సహారా ఇండియా విధులు నిర్వహించిన 15 లక్షల మంది సిబ్బందికి వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఆషాఢమాసం బోనాల జాతర

**ప్రజాపక్షం/మందమర్రి :** మంచిర్యాల జిల్లా, మందమర్రి పట్టణంలోని రాజన్నలవాడ, మేకల మార్కెట్‌లో నిర్వహించిన ఆషాడమాసం బోనాల జాతర కార్యక్రమానికి మాజీ ప్రభుత్వ విప్, చెన్నూరు మాజీ ఎంఎల్‌ఎ నల్లాల ఓదెలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లాల ఓదెలు మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు ఆయనను ఘనంగా సన్మానించగా, స్థానిక ప్రజలను కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సొత్కు సుదర్శన్, బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## వర్షాకాలం దృష్ట్యా పారిశుద్ధ్య చర్యలు వేగవంతం

**ప్రజాపక్షం/మందమర్రి :** మందమర్రి మున్సిపాలిటీలో వర్షాకాలం దృష్ట్యా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు కమిషనర్ తుంగపిండి రాజలింగు తెలిపారు. మెయిన్ రోడ్డు, ఊరు మందమర్రి రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి చెట్లను జేసీబీతో తొలగించారు. లక్ష్మీ భవాని కాలనీలో వర్షపు నీరు నిలవకుండా తాత్కాలిక మురుగు కాలువ తవ్వించారు. పనులను కమిషనర్ స్వయంగా పర్యవేక్షించగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈ. వసంత్, బిల్ కలెక్టర్ బుర్ర లింగయ్య, జవాన్ మేకల నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## సమర్థవంతమైన ప్రజాపాలన దిశగా ప్రభుత్వం చర్యలు

**ప్రజాపక్షం/జైపూర్ :** రాష్ట్రంలో సమర్థవంతమైన ప్రజాపాలన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జైపూర్ మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురం భీమ్ విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎసిపి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ వనజా రెడ్డి, ఎంపిడిఒ శ్రీపతి బాపుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొమురం భీమ్ వీరోచిత పోరాటం చిరస్మరణీయమని, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కొరకు ఒక్కో దానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నూతన పెన్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పెంకుటిళ్ల వివరాలతో నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా వృత్తి విద్య కోర్సులు అందించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/కోటపల్లి :** జిల్లాలో రెవెన్యూ, పౌర సరఫరాలకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు ఆదేశించారు. బుధవారం కోటపల్లి మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబర్ 389లోని 1.12 ఎకరాల భూమిని గుర్తించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం చెన్నూర్‌లోని ఎంఎల్‌ఎస్ పాయింట్ గోదాంను సందర్శించి ప్రజా పంపిణీ బియ్యం తరలింపును ఈ నెల 15లోగా పూర్తి చేయాలని తెలపగా, హాజీపూర్ తహసీల్దార్ కార్యాలయంలో సాదాబైనామా, భూ భారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దరఖాస్తులు నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు.

## పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాలి

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** పట్టుదలతో చదివి ఉద్యోగం సాధించాలని సేవా భారత్ ఏకలవ్య ఆశ్రమం లో నిర్వహించిన ఉచిత పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌ఐ శిక్షణ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. బుధవారం గోదావరిఖనిలోని ఏకలవ్య ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత పోలీసు కానిస్టేబుల్, ఎస్‌ఐ శిక్షయ కార్యక్రమంకు ఎంపిక కోసం వచ్చిన అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరుసద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సంపాదించాలని ఆకాంక్షించారు. ఉత్తమ శిక్షకులతో బోధించి ఉద్యోగాలకు ఎంపిక అయ్యే విధంగా శిక్షణ అందించడం జరుగుతుందన్నారు.